# కామ్రేడ్ సున్నం రాజుకు జోహార్లు



**ఏజన్సీగిరిజన** సంఘం(రైతుకూలీసంఘం(ఆం.ప్ర)అనుబంధం) సీనియర్ నాయకులు కామ్రేడ్ సున్నం రాజు అనారోగ్యంతో 2020 సెప్టెంబర్ 15 రాత్రి మరణించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర)రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ యం.యస్.నాగరాజు ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలదండవేసి నివాళులర్పించారు.

కామ్రేడ్ రాజు పోలవరం మండలం చేగొండపల్లి గ్రామవాసి. పోలవరం భూస్వాములైన పెంటపాటి కుటుంబంవల్ల భూమి కోల్పోయాడు. 1992 నుండి తూటిగుంట, తెల్లవరం ప్రాంతంలో కొనసాగుతున్న గిరిజన పోరాటాన్ని చూసి ఉత్తేజితుడై 95 సం॥ సంఘంలో చేరాడు. సింగనపల్లి, చేగొండపల్లి ప్రజల్ని కూడగట్టడంలో కీలకమైన చురుకైన పాత్ర నిర్వహించాడు. భూముల పునరాక్రమణలో భూస్వాముల్ని, పోలీసుల్ని ఎదిరించడంలో, నిలువరించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాడు. నాయకుల డైరెక్షన్‌ను స్వీకరించడమేకాక, సంఘ దృక్పథంలో భాగంగా తన కుటుంబం కోల్పోయిన భూమి తమకే చెందాలని ఆశించకుండా సంఘంలో ఉమ్మడి సాగులోకి భూమిని కలపడంలో చైతన్యవంతంగా వ్యవహరించాడు. భూముల సమస్య పరిష్కారం కాకుండా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టరాదన్న దానిలోను; ప్రాజెక్టు ముంపు ప్రాంత గిరిజన, గిరిజనేతర ప్రజల్ని ఐక్యపరచడంలో, సమగ్ర పునరావాస సాధనకై జరిపిన కృషిలో కీలకపాత్ర పోషించాడు. ప్రాజెక్టు వద్ద సభ నిర్వహించినందుకు, పునరావాసాన్ని కోరుతున్నందుకు, భూముల పునరాక్రమణలో ఎదుర్కొన్న ఆరు కేసులతోపాటు, రాజద్రోహ నేరం కేసును ఎదుర్కొన్నాడు. 2005 నుంచి 2015 వరకు సాగిన కేసులలో తొమ్మిది నెలలు పైగా జైలు జీవితాన్ని అనుభవించాడు. 2010 నుంచి 2015 వరకు పక్షవాతంతోనే కోర్టు వాయిదాలకు తిరిగాడు. పక్షవాతంతో మాట్లాడలేని, కదలలేని స్థితిలో సంఘ సమావేశాలకు హాజరై సంతోషాన్ని వ్యక్తం చేసేవాడు. కడదాకా సంఘం జెండాను సమున్నతంగా నిలిపిన కామ్రేడ్ సున్నం రాజుకు జోహార్లర్పిస్తున్నాం.

**ఎస్.ఝాన్సి**

**అధ్యక్షులు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**

★ ★ ★